AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
23-2-2026 (Monday) MAIN EDITION

## ఢిల్లీలో మరోసారి బాంబు బెదిరింపుల కలవరం




**అక్షరటుడే, ఢిల్లీ:** ఢిల్లీలోని పలు ప్రాంతాలకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఎర్రకోట, సచివాలయంతో పాటు పలు పాఠశాలలకు బెదిరింపులు రావడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎర్రకోట, ఢిల్లీ సచివాలయానికి సోమవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో భద్రతా సంస్థలు తనిఖీలు చేపట్టాయి. ఢిల్లీ సచివాలయానికి ఇమెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. మధ్యాహ్నం 12 గంటలకు అగ్నిమాపక శాఖకు కాల్ వచ్చింది. దీంతో పోలీసులు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టగా అనుమానాస్పద వస్తువులు దొరకలేదు.

## బెంగాల్ రాజకీయ చాణక్యుడు ముకుల్ రాయ్ కన్నుమూత



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కేంద్ర మాజీ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అగ్రనేత ముకుల్ రాయ్ (71) కన్నుమూశారు. అనారోగ్య కారణాలతో కొంతకాలంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న ఆయన.. సోమవారం తెల్లవారుజామున కార్డియాక్ అరెస్ట్‌కు గురై తుదిశ్వాస విడిచినట్లు ముకుల్ రాయ్ కుమారుడు సుబ్రాన్షు వెల్లడించారు. ఆయన మృతిపై పశ్చిమ బెంగాల్ రాజకీయ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## బంగారం రేట్లకు రెక్కలు అందుకే..



అక్షరటుడే, ఢిల్లీ : ఇటీవల బంగారం ధరలు భారీగా పెరుగుతున్న విషయం తెలిసిందే. దీనిపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు పెద్ద ఎత్తున బంగారం కొనడంతో రేట్లు పెరుగుతున్నట్లు చెప్పారు. దేశంలో బంగారం, వెండి దిగుమతులు ఆందోళనకర స్థాయిలో లేవన్నారు.

## ఆశావర్కర్ల ఆందోళన



అక్షరటుడే, హైదరాబాద్ : మూడు నెలల నుండి జీతాలు ఇవ్వడం లేదని హైదరాబాద్‌లోని - కోఠి డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. రూ.18 వేల కనీస వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లను పోలీసులు అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించారు.

## ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



అక్షరటుడే, ఏపీ: కృష్ణ జిల్లా వెనమలూరులో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సీనియర్స్, జూనియర్స్ మధ్య రెండు రోజులుగా గొడవ జరుగుతోంది. ప్రిన్సిపాల్ విద్యార్థులను మందలించాడు. దీంతో భయపడిన సెకండియర్ విద్యార్థి రైలు కిందపడి సూసైడ్ చేసుకున్నాడు.



## టీటీడీ లడ్డూ కేసులో ప్రభుత్వానికి ఊరట..

**అక్షరటుడే, ఏపీ:** టీటీడీ లడ్డూ కేసులో ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మాజీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ ధర్మాసనం ఏకసభ్య కమిటీ విచారణ కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. వేంకటేశ్వర స్వామి భక్తులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించారని ఏపీ ప్రభుత్వం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై గతంలో సుప్రీంకోర్టు సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ విచారణ కొనసాగుతుండగా.. ఏపీ ప్రభుత్వం ఏకసభ్య కమిటీని నియమించింది. దీనిపై మాజీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం ధర్మాసనం విచారణ చేపట్టింది.



## పెళ్లికి ముందు దగ్గరవ్వొద్దు..

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ సీపీ సజ్జనార్ యువతులకు జాగ్రత్తలు చెప్పారు. పెళ్లి పేరుతో జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలో పెళ్లి పేరుతో జరుగుతున్న మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయని సజ్జనార్ అన్నారు. ప్రేమ పేరుతో, పెద్దలు కుదిర్చిన సంబంధాల మాటున కూడా కొందరు యువతులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలపై ఇటీవల హైదరాబాద్ షీ టీమ్స్‌కు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు.



# గద్వాల నుంచే కొత్త పార్టీ..

**జోగులాంబ గద్వాల జిల్లా నుంచే తాను కొత్త పార్టీ పెడతానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి ఆధ్వర్యంలో గద్వాలలో నిర్వహించిన రైతు సంఘర్షణ సభలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏది జరిగిన ఉత్తర తెలంగాణలోని కరీంనగర్‌లో ప్రారంభం అయ్యేదని కవిత గుర్తు చేశారు. కానీ భవిష్యత్‌లో తాను ఏర్పాటు చేయనున్న పార్టీకి సంబంధించి ఏ కార్యక్రమం జరిగిన జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభిస్తానని చెప్పారు. నడిగడ్డ ప్రజలు నిజాయితీ గల బిడ్డలు అన్నారు. ఇలాంటి గడ్డపై నుంచి ఎలాంటి పని చేసిన జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయన్నారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తాం
- నడిగడ్డను మోసం చేసిన బీఆర్ఎస్
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

రానున్న ఎంపీటీసీ ,జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని కవిత తెలిపారు. ఎన్నికల్లో ఎవరు ఏం ఇచ్చినా.. తీసుకోవాలన్నారు. కానీ పని చేసే వారికి ఓటు వేయాలని సూచించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో డబ్బులు ఇస్తే తీసుకోవాలన్నారు. ఓటు మాత్రం జాగృతికి వేయాలని కోరారు. ప్రతి మండలంలో జెడ్పీటీసీలను నిలుపుతామని ఆమె తెలిపారు.

### బీఆర్ఎస్ మోసం చేసింది

బీఆర్ఎస్ పార్టీ నడిగడ్డను మోసం చేసిందని కవిత పేర్కొన్నారు. ఈ గడ్డకు నీళ్లు ఇవ్వడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ విఫలం అయ్యాయని విమర్శించారు. కొత్తగా వచ్చే రాజకీయ శక్తిగా తాము నడిగడ్డకు నీళ్లు తెస్తామన్నారు. తుంగభద్ర, కృష్ణ నదులు పారుతున్నా.. నడిగడ్డకు నీరు రావడం లేదన్నారు. గద్వాల ఎమ్మెల్యేకు దమ్ముంటే ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని సవాల్ చేశారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని ఎమ్మెల్యే వెంటనే రాజీనామా చేయాలన్నారు.

### ఆపరేషన్ కగార్‌పై..

ఏ రాజ్యం అయినా ఇద్దరు అన్నలకు భయపడుతుందన్నారు కవిత. ఒకరు అడవిలో ఉండే అన్నలని, ఇంకొకరు రైతన్నలని పేర్కొన్నారు. అడవిలో ఉండే అన్నలకు భయపడి వారిని అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమలకు కరెంట్ ఇస్తున్న ప్రభుత్వం.. రైతులకు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వానికి యూరియా ఇవ్వడం చేతగాక యాప్ పేరిట రైతులను ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. రైతు భరోసా ఎన్నికల కోసం ఇచ్చే గిఫ్ట్ అయిందన్నారు. వెంటనే యాసంగి సీజన్‌కు సంబంధించి రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### బకాయిలు చెల్లించాలి

ఆడవాళ్లు లేనిదే వ్యవసాయం లేదని కల్వకుంట్ల కవిత అన్నారు. మహిళా రైతులు ఓ వైపు ఇల్లు, మరోవైపు వ్యవసాయం చూసుకుంటున్నారని చెప్పారు. ఎంతో కష్టపడి రైతులు సాగు చేస్తుంటే దళారులు వారిని దగ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో సీడ్ పత్తి రైతులను దళారులు మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. వారం రోజుల్లో సీడ్ పత్తి రైతుల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే దీక్ష చేస్తామని హెచ్చరించారు.

## ఇరాన్‌ను తక్షణమే వీడండి.. భారత పౌరులకు కేంద్రం అడ్వైజరీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇరాన్‌లో మరోసారి ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఏ క్షణమైనా అమెరికా దాడి చేయొచ్చన్న అంచనాలు, విద్యార్థుల ఆందోళనలతో పరిస్థితులు మళ్లీ గందరగోళంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని భారత పౌరులకు మన దేశ ఎంబసీ తాజాగా అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఆ దేశాన్ని వీడాలని సూచించింది. ఇరాన్‌లోని భారత ఎంబసీతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ఉండాలని పేర్కొన్నారు. అలాగే తాజా పరిణామాల కోసం స్థానిక మీడియాను గమనిస్తూ ఉండాలన్నారు. భారతీయులంతా పాస్‌పోర్ట్‌లు, ఐడీ కార్డులతో సహా తమ ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను ఎల్లప్పుడూ తమ వద్ద సిద్ధంగా ఉంచుకోవాలి. ఈ విషయంలో ఎలాంటి సహాయం కోసమైనా భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించండి. ఇప్పటివరకు ఎంబసీ వద్ద మీ పేర్లు నమోదు చేసుకోకపోతే వెంటనే రిజిస్టర్ చేయించుకోండి'' అని భారత ఎంబసీ తమ అడ్వైజరీలో వెల్లడించింది.

## రేపటి నుంచి నిలిచిపోనున్న ట్రంప్ టారిఫ్‌లు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రతీకార సుంకాల పేరుతో ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయా టారిఫ్‌లను ఈ నెల 24 నుంచి వసూలు చేయమని అమెరికా కస్టమ్స్ విభాగం తెలిపింది. ట్రంప్ టారిఫ్‌లు చట్ట విరుద్ధమని కోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. న్యాయస్థానం మూడు రోజుల క్రితం టారిఫ్‌లను రద్దు చేసినా.. అమెరికా ప్రభుత్వం మాత్రం వాటిని వసూలు చేస్తోంది. ఈ క్రమంలో మంగళవారం నుంచి సుంకాల వసూలును నిలిపి వేస్తామని అధికారులు తెలిపారు. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద విధించిన సుంకాల వసూళ్లను మంగళవారం ఉదయం 12:01 గంటలకు నిలిపివేస్తామని యూఎస్ కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్ ఏజెన్సీ తెలిపింది.

## లోయలో పడిన బస్సు.. ప్రయాణికులకు గాయాలు



**అక్షరటుడే, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం శ్యాంపూర్ గ్రామంలో సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆసిఫాబాద్ డిపోకు చెందిన బస్సు శ్యాంపూర్ వద్ద వంతెనపై నుంచి పడిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స కోసం సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు.

## హిస్టరీ క్రియేట్ చేసిన సాయి పల్లవి..



**భారతీయ చిత్ర పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి సాయి పల్లవి. తాజాగా ఈ బ్యూటీ కేరళలోని కొచ్చిలో జరిగిన 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ వేదికగా హిస్టరీ క్రియేట్ చేసింది. తక్కువ కాలంలోనే అత్యధిక ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్న నటిగా ఆమె రికార్డులకెక్కింది. 'అమరన్' చిత్రానికి గాను ఉత్తమ నటి (తమిళం) అవార్డును అందుకోవడంతో ఆమె ఖాతాలో మొత్తం 7 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు చేరాయి. కేవలం 10 ఏళ్ల సినీ ప్రయాణంలో, అది కూడా కేవలం 20 సినిమాలు కూడా పూర్తి చేయకుండానే సాయి పల్లవి ఈ స్థాయికి చేరుకొని అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ప్రేమమ్ (మలయాళం), ఫిదా (తెలుగు), శ్యామ్ సింగ రాయ్ (తెలుగు), లవ్ స్టోరీ (తెలుగు) సినిమాకు కూడా 'ఉత్తమ నటి' పురస్కారం లభించింది.**

**-అక్షరటుడే, సినిమాడెస్క్**

## మెక్సికోలో చెలరేగిన హింస..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** మెక్సికోలో భీకర దాడులతో టెన్షన్ వాతావరణం నెలకొంది. మాదకద్రవ్యాల ముఠాలపై సైనిక చర్యల్లో భాగంగా.. జాలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్ నాయకుడు 'ఎల్ మెంచో'ను పోలీసులు హతమార్చారు. తమ లీడర్‌ని చంపడంతో కార్టెల్స్ ప్రతీకార దాడులకి తెగబడ్డారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వాహనాలను తగులబెట్టారు. రోడ్లను నిర్బంధించారు. హింసాత్మక దాడులతో మెక్సికోలో అశాంతి నెకలంది. రోడ్డు మీదకు వచ్చి కార్టెల్స్ భీకర దాడులకి పాల్పడుతున్నారు. ఎయిర్‌పోర్టు, పలు ప్రాంతాల్ని ఆక్రమించారు. మాదకద్రవ్యాల వ్యాపారి నెమెసియో "ఎల్ మెంచో" ఒసేగురా మరణించాడని నివేదికలు ధృవీకరించిన తర్వాత ముష్కరులు వాహనాలను తగలబెట్టడం, రహదారులను అడ్డుకోవడం, ఒక ప్రధాన విమానాశ్రయంలో భయాందోళనలు సృష్టించడం వంటి చర్యలకు దిగారు.

## కల్తీపాల ఘటన.. ఐదుకు చేరిన మృతుల సంఖ్య



**అక్షరటుడే, ఏపీ:** ఏపీలోని రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. పలువురు బాధితులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తాజాగా దివాన్ చెరువుకు చెందిన మంచి రాధాకృష్ణమూర్తి, లాలా చెరువు ప్రాంతానికి చెందిన శేషగిరిరావు మృతి చెందారు. అంతకుముందు చౌడేశ్వరి నగర్‌కు చెందిన తాడి కృష్ణవేణి, లాలా చెరువు చెందిన కనక రత్నం సహా మరొకరు చనిపోయారు. నలుగురు చిన్నారులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురితో పాటు, కొంతమంది చిన్నారులకు డయేరియా, కిడ్నీ ఫెయిలైనట్లు వైద్యులు గుర్తించారు.